ముదురుతున్న ఆలయ వివాదం



కూల్చివేతకు నిర్ణయించిన పెద్దమ్మ తల్లి ఆలయం



రైతుల ఆధీనంలోని భూమిలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

- కూల్చేందుకు అధికారుల సమాయత్తం
- ఆందోళనలో భక్తులు, రైతులు

మహేశ్వరం: మామిడిపల్లి గ్రామ శివారులోని పెద్దమ్మ తల్లి దేవాలయ వివాదం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. రోడ్డుకు ఆనుకుని ఉన్న ఆలయాన్ని కూల్చేందుకు అధికారులు సమాయాత్తమవుతుండడంతో గ్రామంలో ఉద్విగ్న పరిస్థితులు నెలకొన్నాయి. సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ ఎదురుగా ఉన్న ఆలయాన్ని తొలగించాలని జీఎంఆర్ సంస్థ అధికారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో నాలుగు రోజుల క్రితం కందుకూరు ఆర్డీఓ సూరజ్ కుమార్, బాలాపూర్ తహసీల్దార్ మాధవిరెడ్డి ఆలయానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న ఆలయాలన్ని తొలగించి మరోచోట ఆలయం నిర్మించుకునేందుకు స్థలాన్ని కేటాయిస్తామని అధికారులు చెప్పారు. ఇందుకు గ్రాయ యువత అభ్యంతరం వ్యక్తం చేశారు. పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని తొలగించవద్దని.. శనివారం అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్గో రోడ్డు నిర్మాణ సమయంలో జల్‌పల్లిలో మజీద్ కోసం వెనుక నుంచి రోడ్డు నిర్మించిన ఘటనను ఉదహరిస్తూ పెద్దమ్మ తల్లి ఆలయాన్ని సైతం ముట్టుకోకుండా ప్రత్యామ్నాయం చూడాలని కోరుతున్నారు.

పేదలకు కేటాయించిన భూమికి ఎసరు

శంషాబాద్ విమానాశ్రయానికి భూములిచ్చిన వారిలోని 12 కుటుంబాలకు అప్పట్లో ప్రస్తుత ఆలయానికి సమీపంలోని 240 సర్వే నంబర్‌లో 30 గుంటల స్థలాన్ని కేటాయించారు. ఈ కుటుంబాల వారు దాదాపు 50 ఎకరాలకు పైగా విమానాశ్రయానికి భూములు ఇచ్చినప్పటికీ.. రికార్డుల్లో మాత్రం కాస్తు ఉండడంతో వీరికి ఎలాంటి పరిహారం అందలేదు. ఈ క్రమంలోనే క్రాస్‌గా మిగిలి ఉన్న ఆ 30 గుంటల స్థలాన్ని మాత్రం అప్పగించారు. ఇప్పటికీ పహాణీలలో రైతుల పేర్లే ఉన్నాయి. ప్రస్తుతం ఈ స్థలంలో ఆలయాన్ని నిర్మించుకోవాలంటూ రెవెన్యూ అధికారులు చెపుతుండడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం రెవెన్యూ అధికారులు ఈ స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయడం పట్ల బాధితులు మండి పడుతున్నారు.

భూముల ధరలు పెరగడంతో..

మామిడిపల్లిలోని వివేకానంద విగ్రహం నుంచి సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్ మీదుగా విమానాశ్రయం వరకు చిన్నదిగా ఉన్న పాత రోడ్డు స్థానంలో వంద ఫీట్లుగా నూతన రహదారిని విస్తరించడం, మెట్రో రైలు సైతం ఈ రూట్‌లో వస్తుండడంతో అందరి కన్ను రహదారిపై పడింది. గతంలో రోడ్డుకు పక్కగ ఉన్న పెద్దమ్మ ఆలయం.. రోడ్డు విస్తరణతో రోడ్డుపైకి వచ్చినట్లయింది. దీంతో పాటు 240 సర్వే నంబర్‌లోని 30 గుంటల స్థలం రోడ్డు పక్కనే విలువైన బిట్టుగా మారింది. ఇక్కడే కొందరు ఆలయానికి ఎసరు పెట్టడం ప్రారంభించారు. జీఎంఆర్ సంస్థలోని కొందరు ఉన్నతాధికారులు రోడ్డు విస్తరణ విషయం ముందే తెలుసుకొని రోడ్డును ఆనుకుని గతంలో తక్కువ ధరకు భూములు కొని, ప్రస్తుతం కోట్లకు పడగలెత్తారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వారే ప్రస్తుతం రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా ఉందనే సాకుతో ఆలయాన్ని తొలగించి, రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో నిర్మిస్తే సరిపోతుందని తెరపైకి తీసుకువచ్చారని మండి పడుతున్నారు. ఈ 30 గుంటల్లో రైతులు ఇళ్లు నిర్మించుకుంటే స్లమ్‌గా మారుతుందన్న భయం ఉన్నట్లుందని భావిస్తున్నారు.

'కారు' కనుమరుగవడం ఖాయం

మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్

మహేశ్వరం: నియోజకవర్గంలో కారు పార్టీ కనుమరుగవడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కందుకూరు మండల పరిధిలోని లేమూరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఢిల్లీ శ్రీధర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. 2018లో మహేశ్వరంలో హస్తం గుర్తుపైన గెలిచిన సబితారెడ్డి స్వలాభం కోసమే కారెక్కారని ఆరోపించారు. త్వరలో నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పెద్ద ఎత్తున చేరికలుంటాయని చెప్పారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ఇంటింటికీ తీసుకెళ్లాలని సూచించారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్, గుల్విి జంగయ్య, దేవేందర్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ముచ్చర్ల నర్సింహ, మహ్మద్ రహీం, రవీందర్, సుధాకర్, నర్సింహ, అశోక్, ఇస్తారి తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, సరికొండ మల్లేశ్, వైస్ ఎంపీపీ శమంత ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు సభావత్ కృష్ణ నాయక్, సీనియర్ నాయకులు రాణా ప్రతాప్‌రెడ్డి, మండల్ కోఆర్డినేటర్ అఫ్జల్‌బేగ్, మాజీ సర్పంచ్ కొండారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు చిగురింత నర్సింహారెడ్డి, సత్యనారాయణ, జగన్, భూపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సత్యనారాయణ రెడ్డి, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికోసం పార్టీలో చేరండి

బడంగ్‌పేట: రాబోయే పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ కనుమరుగు అవుతుందని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చెనగారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్ కార్పొరేటర్ నరేందర్‌కుమార్ (నందు), ఆయన అనుచరులు ఆదివారం కారు దిగి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కేఎల్ఆర్ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో అన్ని సీట్లను హస్తగతం చేసుకుంటామన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్‌లో చేరి తమ ప్రాంతాల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో బడంగ్‌పేట కార్పొరేషన్ సీనియర్ నాయకులు చిగురింత నర్సింహారెడ్డి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల నాయకులు పాల్గొన్నారు.



మహేశ్వరం: కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న శ్రీధర్ ముదిరాజ్ తదితరులు



బడంగ్‌పేట: నరేందర్‌కుమార్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేఎల్ఆర్

రైతన్నతోనే దేశం సుభిక్షం



సాయిరెడ్డిగూడలో రైతులను సన్మానిస్తున్న పర్యావరణ బాల కేంద్ర నిర్వాహకులు

కందుకూరు: మండల పరిధిలోని సాయిరెడ్డిగూడలోని పర్యావరణ బాల చైతన్య కేంద్రంలో యోగాసనాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రైతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పర్యావరణ బాల చైతన్య కేంద్రాల నిర్వాహకుడు రజనీకాంత్ మాట్లాడుతూ.. అన్నం పెట్టే రైతులు దేశానికి వెన్నుముఖలాంటి వారని.. వారికి ఎంత చేసినా తక్కువేనన్నారు. అన్నదాత ఆనందంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంత్యుత్సవాలు

బడంగ్‌పేట్: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ముఖ్యులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె బంజారులకు సంత్ సేవాలాల్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆలయ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్‌లాల్, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో..

స్థానికంగా జెడ్పీహెచ్ఎస్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ పారిజాతారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంజారులకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలి

హుడాకాంప్లెక్స్: సరూర్ నగర్ శ్రీ త్రివేణి పాఠశాల పదవ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు యోగ విన్యాసాలతో చూపరులను కట్టిపడేశారు. మన సంస్కృతి ,సాంప్రదాయాలకు పెద్దపీట వేసే కార్యక్రమాలతో విద్యార్థుల ప్రదర్శన కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సైకాలజిస్ట్, సహజ ఫౌండేషన్ చైర్మన్ శైలజ మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు పిల్లలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే సలహాలు సూచనలు అందించారు. పిల్లలు మొబైల్ వాడే స్థితిని గమనించాలని, రోజు పిల్లలతో గడపాలని, పెద్దలను గౌరవించాలని, పిల్లలలో మంచి గుణాలుపెంపొందించేలాకథలను బెడ్ టైంలో వినిపిస్తే అవి వారికి జీవితాంతం గుర్తుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ త్రివేణి సంస్థల చైర్మన్ గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సందేశాత్మక ప్రదర్శనలను చూపారని కొనియాడారు. పిల్లల్లో నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ బృందానికి సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సునీల్, ప్రధానోపాధ్యాయులు యోగేశ్వరి, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ఓర్వలేకే భూకబ్జా ఆరోపణలు

కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఈశ్వర్ ముదిరాజ్

మహేశ్వరం: తాను కొనుగోలు చేసిన భూమిని కబ్జా చేసిన కాకి లక్ష్మయ్య అతని కుమారులకు బెదిరింపులకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ ఆరోపించారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలోని బొడ్రాయి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేక, రాజకీయంగా ఎదుర్కొనలేక తమపై కొంత మంది భూకబ్జాదారులు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. మహేశ్వరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 87లో మాతల్లి కాకి యాదమ్మకు 3.20 ఎకరాల భూమి ఉంది. ఆమెకు కాకి లక్ష్మయ్య, ఈశ్వరయ్య, సత్యనారాయణ, కుమార్‌లు సంతానం. ఒక్కొక్కరికి 35 గుంటల చొప్పున గిఫ్ట్ డీడ్ చేశారు. మా అన్న కాకి లక్ష్మయ్య తన వాటకు వచ్చిన 35 గుంటల భూమిని 2012లో హైదరాబాద్‌కు చెందిన మేకల దామోదర్‌రెడ్డికి విక్రయించారు. 2022లో మేకల దామోదర్‌రెడ్డి నుండి 35 గుంటల భూమిని 2022లో తాను అప్పటి ధర ప్రకారం కొనుగోలు చేసి తమ పేరుపై రిజిస్ట్రేషన్, పట్టా పాసు బుక్ పొంది రెవెన్యూ రికార్డులో తమ పేరును నమోదు చేసుకున్నామని వివరించారు. కాకి లక్ష్మయ్య అతని కుమారులు సాయిబాబ, హనుమంత్, నాగరాజ్ దౌర్జన్యం చేసి తమని కొనుగోలు చేసిన భూమిని కబ్జా చేసి భూమిలోకి రానివ్వకుండా తమపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తమ భూమిలోకి వస్తే చంపుతామని బెదిరింపులకు పాల్పడడంతో పాటు పోలీసులు సైతం తమని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. కొనుగోలు చేసిన భూమికి అన్ని పత్రాలు తనకు న్యాయ బద్ధంగా ఉన్నాయన్నారు. ఇటీవల వారిపై మహేశ్వరం ఠాణాలో కేసు నమోదైందని గుర్తు చేశారు. తమని రాజకీయంగా ఎదుర్కొనలేక ప్రతిపక్ష పార్టీలతో చేతులు కలిసి తమపై భూ కబ్జా ఆరోపణలు చేస్తున్నారన్నారు. తమపై అసత్యంగా ప్రచారం చేసిన ఆన్‌లైన్, యూట్యూబ్ చానల్స్‌పై త్వరలో పోలీసులకు ఫిర్యాదు చేసి.. కోర్టులో పరువు నష్టం దావా కేసు నమోదు చేయిస్తానన్నారు. భూమి పంచాయతీకి కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని, కావాలని కొంత మంది కాంగ్రెస్ పార్టీకి అంటగట్టి తమపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు తాను ఇప్పటి వరకు ఎవరి భూములు కబ్జా చేయలేదని తన భూమినే లక్ష్మయ్య, అతని కుమారులు కబ్జా చేశారని ఆరోపించారు. తమకు పోలీసులు న్యాయం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న కాకి ఈశ్వర్ ముదిరాజ్, కుమారుడు శివరామ్ ముదిరాజ్

ఆమనగల్లు అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రకటించారు. మున్సిపాలిటీ అభివృద్ధికి మంజూరైన నిధులతో అవసరమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాషా ఆధ్వర్యంలో కాలనీ వాసులు ఆదివారం హైదరాబాద్‌లో నారాయణ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా కసిరెడ్డిని సత్కరించారు. అనంతరం విద్యానగర్ కాలనీలోని సమస్యలపై వినతిపత్రం అందజేశారు. విద్యానగర్ కాలనీలో లో ఓల్టేజీ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని, గృహోపకరణాలు దెబ్బతింటున్నాయని వివరించారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. సీసీ రోడ్లు నిర్మించాలని, కమ్యూనిటీహాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. పాలకవర్గం, ప్రజల సహకారంతో ఆమనగల్లును ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యానగర్‌కాలనీసంఘం అధ్యక్షుడు పాషా, ప్రధాన కార్యదర్శి జంగయ్య, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, సభ్యులు శేఖర్, వెంకటేశ్వర్‌రెడ్డి, పత్యానాయక్, పర్వతాలు, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం పాల్గొన్నారు.



కసిరెడ్డి నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యానగర్‌కాలనీ వాసులు

వాలీబాల్ టోర్నీలో విద్యార్థుల ప్రతిభ

ఆమనగల్లు: మండలంలోని శెట్టిపల్లిలో మూడు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌లో ఆమనగల్లు పట్టణానికి చెందిన వివేకా విద్యాభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. టోర్నమెంట్‌లో పాఠశాల స్థాయి విభాగంలో బాలుర, బాలికల టీమ్‌లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో వివేకావిద్యాభారతి ఉన్నత పాఠశాల టీమ్ మూడో బహుమతి, బాలుర విభాగంలో నాల్గవ బహుమతిని గెలుచుకున్నాయి. విజేతలకు నిర్వాహకులు ఎగిరిశెట్టి సత్యం నగదు బహుమతి, షీల్డులను అందించారు. విద్యార్థులను వివేకావిద్యాభారతి కరస్పాండెంట్ గోలి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మహమూద్, పీఈటీలు ఆనంద్, మల్లేశ్‌లు అభినందించారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముస్తాబు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని క్యాంపు కార్యాలయం కొత్త ఎమ్మెల్యే కోసం ముస్తాబు అవుతుంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలకు క్యాంపు కార్యాలయాలను నిర్మించిన సంగతి తెలిసిందే. నాగార్జునసాగర్-హైదరాబాద్ రాహదారికి సమీపంలో ఖానాపూర్ గ్రామ పరిధిలో ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయాన్ని నిర్మించారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇక్కడ ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపొందారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కార్యాలయాన్ని ఖాళీ చేశారు. ఈ నేపథ్యంలో కొత్త ఎమ్మెల్యేగా ఎన్నికైన మల్‌రెడ్డి రంగారెడ్డి కొలువుదీరేందుకు క్యాంపు కార్యాలయాన్ని అన్ని హంగులతో ముస్తాబు చేస్తున్నారు. పాత టెయిల్స్‌ను తొలగించి కొత్త వాటిని వేశారు. శానిటరీ, ఎలక్ట్రికల్, పార్కింగ్ టైయిల్స్, పెయింటింగ్ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి. సుమారు రూ.15 లక్షల నిధులతో కార్యాలయ మరమ్మతు పనులు చేపడుతున్నారు. ఆర్ అండ్‌బీ ఈఈ శ్రవణ్ ప్రకాశ్, డీఈఈ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈఈ వినోద్ పనులను పర్యవేక్షిస్తున్నారు. త్వరలోనే క్యాంపు కార్యాలయ గృహ ప్రవేశాన్ని ఎమ్మెల్యే మల్‌రెడ్డి చేయనున్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

ఆమనగల్లు: రెండు దశాబ్దాల క్రితం కలిసి చదువుకొని ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా కలుసుకొని సందడి చేశారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఇందుకు కడ్తాల మండలం మైసిగండిలోని మైసమ్మ దేవస్థానం వద్ద ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాలు వేదిక అయింది. పట్టణంలోని వివేకా విద్యాభారతి హైస్కూల్‌లో 2001-2002 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు వెంకటేశ్వరశర్మ, కన్నాజీ, శివలింగం, యాదయ్య, ఆశాలత, హజ్రా, సుమతిని సత్కరించారు. సమ్మేళనంలో పాల్గొన్న వారికి జ్ఞాపికలను బహుకరించారు.

క్లుప్తంగా

నేడు అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ



భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న పరమహంస విద్యారణ్య భారతి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్‌లో సామల పాపిరెడ్డి గార్డెన్ దగ్గర నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయంలో అభయాంజనేస్వామి గణపతి నవగ్రహ శిఖర ధ్వజ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ సామల రంగారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం 10.38 గంటలకు హంపి పీఠాధిపతి పరమ హంస విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామిజీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన చేస్తారని చెప్పారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: మండల పరిధిలోని దెబ్బడగూడకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు రమేశ్ కూతురు కీర్తన అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో వైద్యం పొందుతుంది. వారి కుటుంబం ఆర్థికంగా వెనకబడి ఉండటంతో ఎమ్మెల్యే సబితారెడ్డిని సంప్రదించారు. దీంతో ఆమె చొరవతో రూ.1.50 లక్షల నిధులు మంజూరు చేస్తూ ఎల్‌ఓసీ జారీ చేసింది. ఆదివారం ఆ ఎల్‌ఓసీ పత్రాన్ని లబ్ధిదారులకు సబితారెడ్డి అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడు కొలను విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

శాంతి భద్రతల విషయంలో రాజీపడొద్దు



కేఎల్ఆర్‌కు మొక్క అందజేస్తున్న ఏసీపీ

మహేశ్వరం: శాంతిభద్రతల విషయంలో రాజీ పడొద్దని.. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం అమలు చేయాలని ఏసీపీ ఉమామహేశ్వర్‌రావుకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్ఆర్ సూచించారు. ఆదివారం ఏసీపీ ఉమామహేశ్వర్‌రావు అక్బర్‌ఫాం హౌస్‌లో కేఎల్ఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డికి ఏసీపీకి మొక్క అందజేశారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

కడ్తాల్: కడ్తాల్ మండలం మక్తమాధారం గ్రామంలో వెలసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఆరు రోజుల పాటు, భక్త జన సందోహం మధ్య వైభవంగా ఉత్సవాలు కొనసాగాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో నిత్యవిధి ,మహా పూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజా అవరోహణం, దేవతా విసర్జనం, పుష్పయాగం, సప్తవరణ మహాదాశీర్వాదం కార్యక్రమాలు నిర్వహించారు. పూజ కార్యక్రమాల్లో జిల్లా ఎంపీటీసీల సంఘం గౌరవ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్ పాల్గొన్నారు. అదే విధంగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశ్‌గౌడ్, బాల్‌రాజ్ వేదపండితులు రామానుజన్ చార్యులు, ఆదిత్యచార్యులు స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

శెట్టిపల్లిలో అన్నదానం

ఆమనగల్లు: మండలంలోని శెట్టిపల్లిలో వెలసిన అలివేలు మంగా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా అర్చకులను మాజీ సర్పంచ్ సత్యం, ఆలయ చైర్మన్ శ్రీనివాస్, ఆలయ ట్రస్టీ జగన్, మాజీ సర్పంచ్ గోదాదేవి ఆధ్వర్యంలో సత్కరించారు.